# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 25 సెప్టెంబరు, 2026 | పేజీలు :08


## గణేశ్ నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ



వివరాలు మెయిన్‌లో...

# సహజసిద్ధంగా మల్లూరు ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

### మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ప్రజాపక్షం/మంగపేట:** ములుగు జిల్లా మంగపేట మల్లూరు శ్రీ హేమాచల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ పరిసరాల్లోని సహజసిద్ధ వాతావరణాన్ని పరిరక్షిస్తూ క్షేత్ర విశిష్టత ప్రతిబింబించేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులతో ఎవరికీ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మల్లూరు క్షేత్రం లోని దట్టమైన అడవులు, వందల ఏళ్ల నాటి వృక్షాలు స్వచ్ఛమైన గాలి సహజ జలవనరులతో కూడిన ఆహ్లాదకర వాతావరణం ఎంతో అరుదైనదని పేర్కొన్నారు. ఇటువంటి ప్రకృతి సంపదను కొత్తగా నిర్మించలేమని, ఎంత ఖర్చు చేసినా కొనుగోలు చేయలేమని తెలిపారు. ఆలయ పరిసరాల్లోని సహజత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల అవసరాలు, భవిష్యత్తులో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు పారిశుద్ధం విశ్రాంతి ప్రదేశాలు వాహనాల నిలుపుదల, రాకపోకలకు అనువైన మార్గాలు వంటి సౌకర్యాలకు మాస్టర్ ప్లాన్‌లో ప్రాధాన్యం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ చరిత్ర పురాణ నేపథ్యం స్వామి వారి విశిష్టతను భక్తులకు తెలియజేసేలా ఆకర్షణీయమైన శిల్పాలు విగ్రహాలు ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. క్షేత్ర గొప్పతనం ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా మాస్టర్ ప్లాన్‌ను అద్భుతంగా ఆవిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి సంపదను కాపాడుతూనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, మల్లూరు క్షేత్రాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ మండపం విస్తరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, భక్తుల సౌకర్యార్థం వసతి గదులు, కల్యాణ మండపం, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న గోశాలకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, ఆలయ ఈఓ వీరస్వామి, తహసిల్దార్ తోట రవీందర్, ఎంపిడిఓ బద్రునాయక్, ఎస్ఐ టీవీ ఆర్ సూరి, సంబంధిత అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో పౌష్టికాహార విప్లవం!



**ప్రజాపక్షం / మెదక్ :** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మెదక్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ త్వరలో ప్రారంభం కానుంది. మెదక్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈ కిచెన్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

**29 వేల మందికి పౌష్టికాహార భరోసా**

మెదక్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలోని దాదాపు 11 మండలాల్లో 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న మొత్తం 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు.

**రోజుకో రకం అల్పాహారం..రోజు విడిచి రోజు పాలు**

విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (నిన్) సహకారంతో ప్రత్యేక మెనూను రూపొందించారు.

**విజయవంతమైన పథకం..మెదక్ జిల్లాకు విస్తరణ**

తెలంగాణ ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను తొలుత పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనతో మధిర, మంథ ని, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల్లోనూ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు.

**విద్యార్థుల ఆరోగ్యం.. విద్యపై ఏకాగ్రతే లక్ష్యం: కలెక్టర్ ప్రతిమా సింగ్**

ఉదయం వేళ పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.ఆకలిని అధిగమిం చి, ఆరోగ్యకరమైన అల్పాహారంతో విద్యార్థులు ఉత్సాహంగా చదువుపై దృష్టి సారించేలా చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. మెదక్‌లో కిచెన్ ప్రారంభమైతే వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టి క అల్పాహారం అందుబాటులోకి రానుంది. త్వరలో ప్ర భుత్వ ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ మంత్రి,స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఒలతో గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలపాటు వర్షాలకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు.మండలాల వారీగా వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని వేలేరు , ఆత్మకూర్ మండలాల్లో బుధవారం కురిసిన వర్షంతో అధిక వర్షపాతం నమోదైందన్నారు. శుక్రవారం కూడా ఆకస్మికంగా భారీ వర్షపాతం నమోదైతే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉందో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని కలెక్ట ర్ ఆదేశించారు. గ్రే టర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త ను వెంటనే తొలగించాలన్నారు.ప్రధాన నాలాల వద్ద వరద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలాగే అన్నీ మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. ఈ గూగుల్ మీట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జెడ్పిసిఇఒశేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటి పారుదల శాఖ ఇఇమంగీలాల్, రోడ్లు,భవనాలు శాఖ ఈఈ దేవిక చౌహన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులపై బిఆర్ఎస్ నేతల నిరసన

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని చెల్పూర్ విద్యుత్ కేంద్రం సందర్శనకు వస్తున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులను కలవకుండా తమను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. విద్యుత్ కోతలపై ప్రజల తరుపున ప్రశ్నిస్తామనే భయంతోనే ప్రభుత్వం పోలీసుల ద్వారా ముందస్తు అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. ముందస్తుగా అరెస్టయిన వారిలో బిఆర్ఎస్ గణపురం మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఉడుత సాంబయ్య యాదవ్, కొండారి హైమావతి ధనుంజయ్, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు హఫీజ్, సీనియర్ నాయకులు దాసరి రవీందర్, గాజర్ల చింటూ గౌడ్, మామిండ్ల సాంబయ్య యాదవ్, పబ్బ రవీందర్ గౌడ్ ఉన్నారు.

**చిట్యాలలో:** విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించడంతో పాటు ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో కెటిపిపి కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన చిట్యాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పలువురు నాయకులను ఇళ్ళ వద్దే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు, విద్యుత్ ఉత్పత్తి పరిస్థితిని పరిశీలించేందుకు శాంతియుతంగా నిర్వహించతలపెట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను నిరోధించడమేనని పేర్కొన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? విద్యుత్ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయకుండా అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. విద్యుత్ సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## 27న కవి సమ్మేళనం

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** 27న ఉదయలయన్స్ క్లబ్ మహబూబాబాద్ కంకర బోర్డులో జరిగే కవి సమ్మేళనం జయప్రదం చేయాలని అరసం నిర్మాణ బాధ్యులు కొంపెల్లి రామయ్య ఆహ్వానం పలికారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో లైన్స్ క్లబ్ భవన్లో అభ్యుదయ రచయితల సంఘం అరసం మహబూబాబాద్ జిల్లా సమావేశం కేదాసు రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగే కవి సమ్మేళనం లో పాల్గొనే కవులు సామాజిక అభ్యుదయభావజాలం ఉన్న కవితలకు మాత్రమే అవకాశం ఉంటుందని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదని, తమ పేరు కొంపెల్లి రామయ్య చరవాణి నెంబర్ 703 25 04646 కు కేదాసు రమేష్ సెల్ నెంబర్ నీలం వెంకటేశ్వర్లు సెల్ నెంబర్ తనను సంప్రదించాలని వీరి వద్ద తమ యొక్క పేర్లను నమోదు చేసుకోవాలని, సమాజం పట్ల మన బాధ్యతతో కవులు కవయిత్రులు అధిక సంఖ్యలో తమ విలువైన సమయాన్ని కేటాయించి పాల్గొనాలని కోరారు. ఈ అభ్యుదయ రచయితల సంఘం నిర్మాణ సన్నాహక సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, కవులు, రచయితలు, కళాకారులు, కట్లోజు పాండురంగ చారి, నీలం వెంకటేశ్వర్లు, గన్నోజు ప్రసాద్ ,గుర్రం సత్యనారాయణ ,సంకపల్లి శ్రీనివాస్ రెడ్డి ,శ్రీనివాస వర్మ, సురేష్ ,అజ్మీర వేణు ,తండ సందీప్ ,గాధ్యం శ్యాంప్రసాద్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# జిఎంఆర్‌లో గణపతి లడ్డూ, కరెన్సీ మాలలు, పట్టు వస్త్రాల వేలం పాట

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ వడ్డేపల్లిలోని జిఎంఆర్ బృందావన్ అపార్ట్మెంట్స్ లో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా ముగిసాయి.ఈ సందర్భంగా జీఎంఆర్ గణపతి ముందు నవ రాత్రులు పూజలు అందుకున్న ప్రసాదమైన పవిత్ర లడ్డూ వేలం పాటను వేదికపై ఘనంగా నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంపాటలో జిఎంఆర్ బృందావన్ అపార్ట్మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాదెపాక స్వర్ణ కుమార్ రూ.1,62,000 వేలకు పెద్ద లడ్డును వేలంపాడి కైవసం చేసుకున్నారు.లడ్డూతో పాటు స్వామివారిని అలంకరించిన నాలుగు కరెన్సీ నోట్ల మాలలను కూడా వేలంలో జిఎంఆర్ నివాసితులు వి. కళాధర్ రెడ్డి రూ.30516, కోట రామచంద్రారెడ్డి రూ.26 716, బూర అనిల్ రూ.25000,ఎ.అనిరుద్ రూ.155 16 ల



కు సొంతం చేసుకున్నారు.అలాగే స్వామివారి పట్టు వస్త్రాలను జిఎంఆర్ నివాసి నాగరాజు రూ.6116 కు కైవసం చేసుకున్నారు. లక్ష్మీ ద్రా చిన్న లడ్డును ద్రా తీయగా జిఎంఆర్ నివాసి చింతకుంట్ల లక్ష్మికి దక్కింది.అసోసియేషన్ అధ్యక్షులు వి. దయాకర్ రెడ్డి అభినందనలు తెలిపారు.ఈ వేలం ద్వారా వచ్చిన మొత్తం సొమ్మును వచ్చే ఏడాది జరగనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఉపయోగించనున్నట్లు జిఎంఆర్ అపార్ట్మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి దొంగరి నవీన్ కుమార్ తెలిపారు.భారీ వర్షం మధ్య సాయంత్రం నుంచే ప్రారంభమైన వేలం పాట ప్రక్రియను చూసేందుకు, పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.వేలం ప్రారంభం కాగానే నివాసితులైన భక్తులు, స్థానిక ప్రముఖులు ఒకరిని మించి మరొకరు ఉత్సాహంగా పాట పాడారు.విజేతలకు కమిటీ సభ్యులు లడ్డూ ప్రసాదాన్ని, కరెన్సీ మాలలను, పట్టు వస్త్రాలను బహుకరించారు. వేలం పాటలో విజేతలుగా నిలిచిన భక్తులను అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.అనంతరం భక్తుల జయజయధ్వానాలు, కోలాటాలు,మంగళవాయిద్యాల నడుమ గణపతి నిమజ్జన శోభాయాత్ర వేడుకగా సాగింది.

## లక్ష్మీదేవి పేటలో పోషణ మాస వారోత్సవాలు

### ఐసిడిఎస్ సిడిపిఒ శిరీష

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** అంగన్వాడీలోనే బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారం అందుతుంది అని ఐసిడిఎస్ సిడిపివో శిరీష, వెంకటాపూర్ సెక్టర్ సూపర్‌వైజర్ అనంత లక్ష్మి అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీ దేవి పేట అంగన్‌వాడి సెంటర్‌లో అంగన్వాడి టీచర్ మద్దెల సంధ్య ఆధ్వర్యంలో పోషణ మాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒశిరీష, వెంకటాపూర్ సెక్టర్ సూపర్వైజర్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొమ్మ కంటి వంశావతి, సఖి టీచర్స్ శిరీష , స్రవంతి అంగన్వాడి టీచర్స్ రజిని, సబిత, గీత తల్లుల కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొమ్మకంటి వంశవతి రమేష్ పాల్గొని మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు టి హెచ్ ఆర్ పిల్లలు ప్రీస్కూల్ ఆధ్వర్యంలో పోషణ మహా అంటే ప్రజల్లో పౌష్టికాహారం ఆరోగ్యం పరిశుభ్రత, పోషకాహార లోపం నివారణపై అవగాహన కల్పించారు. గర్భిణీ బాలింతలు చిన్నారులు, కిషోర్ బాలికలకు సరైన పోషణ పై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం పిల్లలకు తగిన పోషకాహారం



అందించడం తల్లిపాల ప్రాముఖ్యత ఆకుకూరలు పండ్లు పప్పులు, ధాన్యాలు వంటి పోషకాహారాలు వినియోగం వ్యక్తిగత పరిశుభ్రత చేతులు శుభ్రంగా కడుక్కోవడం పిల్లలు ఎదుగుదల బరువు ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం, గర్భిణీ స్త్రీలు బాలింతలకు పోషణ పై , సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం ,పోషకాహారం ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు ప్రతి బిడ్డకు, గర్భిణీ దశ నుండి పిల్లల రెండు సంవత్సరాల వయసు కాలపరిమితి వెయ్యి రోజుల పరిమితి అత్యంత కీలకమైన దశ తల్లులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్పర్ గోగు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘ స్వర్ణోత్సవ సభ

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 50వ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి పిలుపునిచ్చారు. ఈ నెల 27న హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ మేనేజ్‌మెంట్ హాల్‌లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం నెక్కొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాంకాల యాదగిరి మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుండి అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, అంబేద్కర్ వాదులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు మీద 1976లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం 1033/77 నంబర్‌తో కొనసాగుతూ 50 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత సామాజిక చైతన్యం కోసం కృషి చేయాలని, సంఘ నిర్మాణం, సామాజిక సమానత్వం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు కొంగర సూరి రావు, మాజీ మండలాధ్యక్షుడు బిర్రు సుదర్శన్, మాల మహానాడు జిల్లా నాయకుడు కడగండ్ల యాకయ్య, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకుడు తడుగుల జనార్ధన్, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి శివాజీ, ఈదునూరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## 28, 29, 30లలో ఎఐకెఎంఎస్ నాలుగవ జాతీయ మహాసభలు

### ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు

**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఈనెల 28, 29, 30 తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) నాల్గవ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు. నర్సంపేట పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో గురువారం పోస్టర్ ను ఆవిష్కరించారు. 28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుండి ప్రజా ప్రదర్శన ఉంటుందని,మధ్యాహ్నం రెండు గంటలకు ఎస్సార్ అండ్ బిజివిఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఎఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహిస్తారని, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్, తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్యలతోపాటు ఒడిస్సా, పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, బీహార్, అస్సాం తదితర రాష్ట్రాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. 29,30 తేదీలలో ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ తొలిపలుకులు ఇస్తారని, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ, నాయకులు భీమగాని మల్లయ్య, ఐలయ్య, ఐఎఫ్టియు నాయకులు ,పివైఎల్ జి ల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, ఆకుల వెంకట్,పిడిఎస్‌యూజిల్లాఅధ్యక్షుడుతదితరులు పాల్గొన్నారు.

## వర్ధంతి వేడుకల్లో బోయిని శ్రీనివాస్

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు బోయిని శ్రీనివాస్, గురువారం జనగామ జిల్లాలోని మార్కెట్ యార్డ్ లో కామ్రేడ్ అమరజీవి సిపిఐ పార్టీ నాయకులు దివంగత తొర్ర సత్యం 5వ వర్ధంతి సందర్భంగా వారి పాల్గొని ఆయన స్తూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, సత్యం సిపిఐ పార్టీకి, వెన్నుముక లా ఉండి పార్టీకి ఎన్నో సేవలు అందించారని వారిని కొనియాడారు. జనగామ పట్టణ ప్రాంతాలలో సిపిఐ పార్టీని ఏఐటీయూసీ కార్మిక కర్షక సంఘాలను ఏర్పాటు చేసి ప్రాణం పోసిన ఘనత తొర్ర సత్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చక్రాల రఘు, కాళ్ల శీను, పరుశురాం కదారి శీను, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



# భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనం

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడు గురువారం గంగమ్మ ఒడికి చేరాడు. మండల వ్యాప్తంగా 'గణపతి బప్పా మోరియా.. జై జై గణేశా' నినాదాలతో భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా ఊరేగింపుగా బయలుదేరి విగ్రహాలను సాగనంపారు.మండలంలోని 16 గ్రామాలతో పాటు పొరుగు మండలాల నుంచి సుమారు 200 వరకు విగ్రహాలు కటాక్షపూర్ పెద్ద చెరువుకు తరలివచ్చాయి.తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ బాబూలాల్, ఎస్ఐ తిరుపతి, ఎంపీ ఓ యోగిత, వైద్యాధికారి స్పందన పర్యవేక్షణలో నిమజ్జనా కార్యక్రమం సజావుగా సాగుతున్నది. ముందుగానే చెరువు వద్ద క్రేన్లు, లైటింగ్, బారికేడ్లు ఏర్పాటు చేశారు. విగ్రహాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు కేటాయించారు.సీఐ బాబూలాల్ ఆధ్వర్యంలో ఎస్సై తిరుపతి సహ 16 సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ ఏఈ సుదర్శన్ ఆధ్వర్యంలో చెరువు పరిసరాల్లో హైమాస్ట్ లైట్లు, తాత్కాలిక విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశారు.ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పరిశుభ్రత విధులు చేస్తున్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అత్యవసర మందులు, అంబులెన్స్ అందుబాటులో ఉంచారు. ఇరిగేషన్ అధికారులు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తున్నారు.అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధులు, భక్తుల సహకారంతో నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా సాగుతుందని తహసీల్దార్ తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సయ్యద్ మౌలా, ఉప సర్పంచ్ లక్ష్మి రాంబాబు, వార్డు సభ్యులు గోరిబీ హుస్సేన్, కరీంబీ మౌల, కమల్, సలీం, రాజు, కర్ణాకర్ యుగంధర్, కార్యదర్శి అమిత, ప్రజాప్రతినిధులు అధికారులు భక్తులు పాల్గొన్నారు.

## రాజకీయ జోక్యం లేకుండా చూడాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** ఆయా ఇన్స్పెక్టర్ పోస్టుల నియమకాల్లో సరైన రోస్టర్ విధానాన్ని పాటించి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన వారికి అవకాశం కల్పించాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బిఆర్ఎస్ శ్రేణులు ఎంఈఓ కోడెపాక రఘుపతిని కలిసి ఆయా ఇన్స్పెక్టర్ పోస్టుల నియామకాల్లో సరైన రోస్టర్ విధానాన్ని పాటించి, నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. అల్లం రవీందర్ మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వ సూచనల మేరకే రోస్టర్ విధానాన్ని నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్, పార్టీ ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్‌రావు, నాయకులు బుర్ర శ్రీధర్‌గౌడ్, సర్పంచ్‌లు ఎలగొండ తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతలు అర్థరహిత విమర్శలు మానుకోవాలి

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కం అశోక్

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహిత మని ఇకపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు కట్కం అశోక్ బుధవారం ప్రకటనలో హెచ్చరించారు.పదేళ్ల అధికారంలో ఉండి మంథని నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన మీరు ఇప్పుడు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు.మహాదేవపూర్ కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేయించింది శ్రీధర్ బాబు అని స్పష్టం చేసారు.అగ్నిమాపక కేంద్రలో నిర్వహిస్తున్న పనుల తాత్కాలికంగా ఆగాయని కనీస అవగాహన లేకుండా బిఆర్ఎస్ నాయకులు ఆరోపనలు చేయడం వా రి అజ్ఞానానికి నిదర్శన మని తెలిపారు.



**దోచుకుని తరలించారు**

గత పదేళ్ల కాలంలో నియోజకవర్గానికి బిఆర్ఎస్ చేసిందేమీ లేదని ఇక్కడి వనరులను దోచుకుని తరలించారని విమర్శించారు.సీనరేజ్ ఫండ్స్ కోసం ప్రత్యేక జిఒ తీసుకొచ్చి మండలానికి చెందాల్సిన కోట్ల రూపాయలు దో చుకున్నది బిఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు.మండలకేంద్రంలోని మాడా,డిఎస్పి కారాలయాలు తరలిపోయింది బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్న సంగతి మరిచి మాట్లాడడం సరి కాదని ముంపు బాధిత రైతులకు పరిహారం ఇప్పించకపోగా నేడు అర్థర హితంగా మాట్లాడడం సమంజసం కాదని తెలిపారు.

**నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత శ్రీధర్ బాబు**

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి స మన్యాయం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు అందుతున్నాయని తెలిపారు. ఇకపై మా నాయకుడు రాష్ట్ర మంత్రి ఉద్దిళ్ల శ్రీధర్ బాబు పై విర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# జాతీయ సేవా పథకం కీలక పాత్ర

## కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** యువతలో నాయకత్వ లక్షణాలు, సేవా స్ఫూర్తి, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడంలో జాతీయ సేవా పథకం కీలక పాత్ర పోషిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా గురువారం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వైస్‌ఛాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరై మాజీ, ప్రస్తుత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం విద్య, పరిశోధనతో పాటు సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత కోసం కృషి చేస్తున్నదన్నారు.ఎన్ఎస్ఎస్ సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ, కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు సాధించిందన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా ప్రజా సేవ పట్ల తనలో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని, ఎన్ఎస్ఎస్ సేవలను మరింత విస్తరించేందుకు విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ భవన్ నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు.తెలంగాణ అకాడమీ చైర్మన్, మాజీ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ఆచార్య కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ, సేవా, అవగాహన కార్యక్రమాల ద్వారా వేలాది మంది విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంపొందించామని తెలిపారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య టి. మనోహర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎన్. రమణ, మాజీ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారులు ఆచార్య జి. బాలస్వామి, ఆచార్య ఎం. కిష్టయ్య, ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య సుంకరి జ్యోతి, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించడంతో పాటు ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో కేటీపీపీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన భూపాలపల్లి పట్టణ, మండల, చిట్యాల, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్ళపల్లి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పలువురు నాయకులను ఇళ్ల వద్దే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు, విద్యుత్ ఉత్పత్తి పరిస్థితిని పరిశీలించేందుకు శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను నిరోధించడమేనని పేర్కొన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా..? విద్యుత్ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ టీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి కటకం జనార్ధన్, టిఆర్ఎస్ నాయకులు మాడ హరీష్ రెడ్డి, కౌన్సిలర్లు వేషాల రాజు, కట్ల పూర్ణం, మాదాసి తిరుపతమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మల్లారంలో వైభవంగా గణనాథుడి నిమజ్జనం

**ప్రజాపక్షం/మంగపేట:** వినాయక చవితి సందర్భంగా మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గత పది రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుని గురువారం భక్తులు పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. అకినేపల్లి మల్లారంలో కూడా బుధవారమే వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా బుధవారం గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో గురువారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మండప వ్యవస్థాపకులు, అకినేపల్లి మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ వత్సవాయి శ్రీధరవర్మ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శోభా యాత్ర నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య యువతీ, యువకులు, చిన్నారులు, మహిళలు చేసిన డ్యాన్సులు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మండప వ్యవస్థాపకులు, అకినేపల్లి మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ వత్సవాయి శ్రీధరవర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు వత్సవాయి వశిష్ఠ ఆజాద్,తదితరులతో పాటు అకినేపల్లి మల్లారం, అకినేపల్లి మల్లారం ఎస్టీ కాలనీ, టి.కొత్తగూడెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కరెంట్ కష్టాలకు కాంగ్రెస్ విధానాలే కారణం!

**ప్రజాపక్షం/గణపురం:** రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి కాంగ్రెస్ విధానాలే కారణమని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు కెటిపిపిని సందర్శించేందుకు గురువారం వచ్చిన ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులను పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీనితో ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద ఉద్రిక్తత నెలకొంది. అనంతరం బిఆర్ఎస్ బృందాన్ని పూచీకత్తుపై ప్లాంట్‌లోకి అనుమతించినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే‌పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో 7778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని తమ ప్రభుత్వ హయాంలో 19,472 మెగావాట్లకు పెంచామని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. 400 కెవి సబ్‌స్టేషన్లను ఆరు నుండి 28కు, 220 కెవి సబ్‌స్టేషన్లను 51 నుండి 103కు పెంచామని పేర్కొన్నారు.




**కెటిపిపికి బొగ్గు కొరత?**

భూపాలపల్లి సింగరేణి ఓసి1, ఓసి2, ఓసి3లో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. రోజుకు సుమారు 5వేల టన్నులు రావాల్సి ఉండగా 2వేల టన్నులు కూడా రావడం లేదన్నారు. బొగ్గు కొరత కారణంగా కెటిపిపి యూనిట్లలో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదని ఆరోపించారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి సంస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాసిరకం బొగ్గు వినియోగం వలన జెన్‌కోకు రూ.2900 కోట్ల నష్టం వాటిల్లిందన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. సింగరేణి కార్మికులకు అవసరమైన భద్రతా సామాగ్రిని అందించాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎర్రబెల్లి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ ఎంఎల్‌ఏలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేష్, శంకర్ నాయక్, ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం వద్ద వినాయక నిమజ్జనం వేడుకలు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన వద్ద గోదావరి తీరంలో బుధవారం రాత్రికల్లా నిర్వహించిన వినాయక నిమజ్జనం వేడుకలు అధికారుల పర్యవేక్షణ,పోలీసుల బందోబస్తు నడుమ ప్రశాంతంగా కొనసాగాయి.వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన 466 వినాయక విగ్రహాలను గోదావరి తీరంలో నిమజ్జన కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.గత ఏడాది కంటే ఈ ఏడాదిలో వినాయకుల నిమజ్జనం సంఖ్య కొంత మేర పెరిగినట్లు అధికారులు తెలిపారు.వినాయక నిమజ్జనం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా కొనసాగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

# పసర సెక్టార్లో పోషణ మాసం సంబరాలు

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** తాడ్వాయి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పసర సెక్టార్లోని పసర4అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ప్రేమలత తల్లులను ఉద్దేశించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలని గర్భస్థ దశ నుండి 2సంవత్సరాల పిల్లల వరకు 1000రోజుల ప్రాముఖ్యత 3సంవత్సరాల నుండి 6సంవత్సరాల వరకు అంగన్వాడీ కేంద్రానికి హాజరయ్యే ప్రీ స్కూల్ పిల్లలకి ఇస్తున్న పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. శరీరానికి హాని కలిగించే ఆహార పదార్థాలు తినకూడదు ఇంట్లో తయారు చేసుకున్న ఫుడ్ తీసుకోవాలి పిల్లలకి స్నాక్స్ బిస్కెట్స్ చిప్స్ కూల్ డ్రింక్స్ లాంటివి ఇవ్వకూడదని తల్లులు పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంట్లో స్నాక్స్ తయారు చేసి ఇవ్వాలని అంగన్వాడికి మూడు సంవత్సరాల నుండి పిల్లలను పంపించాలని పిల్లలకు గర్భిణీ బాలింతలకు అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారం ఒక్క పూట భోజనం పాలు గుడ్లు కురుకురే బాలామృతం తీసుకుని ఆరోగ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎస్ఎమ్ ఎమ్ఎఎమ్ పిల్లలకు ఇచ్చే బాలామృతం ప్లస్ తప్పకుండా తినిపించాలని సూచించారు. అన్ని రకాల పౌష్టికాహారం లభించే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాన్ని మన బాధ్యతగా భావించాలని సరైన పౌష్టికాహారంతీసుకుని అందరూ మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ శారద అంగన్వాడి టీచర్ పద్మ రాణిఆయారాజ్యంఆశవర్కర్ శ్యామల తల్లులందరూ పాల్గొన్నా రు.

# బాట వివాదంతో వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య

**ప్రజాపక్షం/గూడూరు;** ఇంటి బాట విషయంలో తలెత్తిన వివాదం ఎదుటి వ్యక్తుల దూషణలు తట్టుకోలేక ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన గూడూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సిహెచ్ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం భూపతిపేట గ్రామానికి చెందిన తేజావత్ ద్వాలి అలియాస్ ద్వాలమ్మ (69) తన భూమి నుంచి 12 అడుగుల వెడల్పు గల దారిని 2022 లో జక్కుల మునేష్‌కు విక్రయించారు. అప్పటి నుంచి సదరు దారి విషయమై ఇరువర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం (సెప్టెంబర్ 23) ఉదయం సుమారు 9;30 గంటల ప్రాంతంలో దారి విషయంలో జక్కుల రజిత తేజావత్ ద్వాలిల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది.ఆసమయంలో రజిత తనను కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో తిట్టి చచ్చిపో అంటూ తీవ్రంగా అవమానించి బెదిరింపులకు గురిచేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ద్వాలమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున సుమారు 4;30 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచారు. మృతురాలి మనవడు తేజావత్ రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ రమేష్ బాబు వెల్లడించారు.

# విద్యుత్ కార్మిక సంఘం 327 డివిజన్ కార్యదర్శిగా మధు

ప్రజాపక్షం, తొర్రూరు : విద్యుత్ కార్మిక సంఘం 327 తొర్రూరు డివిజన్ కార్యదర్శిగా పసుపులేటి మధు ఎన్నికయ్యారు. ఐఎన్‌టీయూసీ అనుబంధ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం 327 సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కంపెనీ ఉపాధ్యక్షులు కె.వీరసోములు, జిల్లా అధ్యక్షులు సలుగు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాము వెంకటేశ్వర్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ పాషా, డివిజన్ అధ్యక్షులు కేశబోయిన బోజాలు సమక్షంలో తొర్రూరు డివిజన్ కార్యదర్శిగా పసుపులేటి మధు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యలపై అన్ని యూనియన్లను కలుపుకొని జేఏసీగా ఏర్పడి విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం సంఘం రాష్ట్ర సెక్రెటరీ జనరల్ శ్రీధర్ ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. ఆర్టిజన్ కార్మికులకు సర్వీస్ రూల్స్ వర్తించేలా విద్యుత్ కార్మిక సంఘం ఎంతో కృషి చేస్తుందన్నారు. నాపై నమ్మకం ఉంచి తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని తెలిపారు.

# ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** ఉప ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉద్యోగుల పెండింగ్ సమస్యల విషయంలో రెండు డిఎలను దసరా పండుగ సందర్భంగా విడుదల చేస్తామని, నెలాఖరు లోగా పిఆర్‌సి రిపోర్ట్ తెప్పించుకుంటామని, సిపిఎస్ రద్దు కోసం కమిటీ ఏర్పాటు తదితర డిమాండ్స్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, మారం జగదీశ్వర్ రాష్ట్ర ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్,ఎస్.ఎం.హుస్సేని ముజీబ్ టీఎన్‌జీఓస్ ప్రధాన కార్యదర్శి,జెఏసి సెక్రటరి జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డిలకు జిల్లా జెఏసి పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా ఉద్యోగులజెఏసి చైర్మన్ ఆకుల రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు .

## వర్ష బీభత్సం...

**ప్రజాపక్షం, కమలాపూర్:** భారీ వర్షంతో అతలాకులమైన కమలాపూర్‌లో వర్షభీభత్సం సృష్టించింది. గత రెండు రోజులు కమలాపూర్, మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో భారీ వర్షం కురవడంతో చిన్న చిన్న రేకుల షెడ్లు, ఇతర సామాగ్రి, ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లు కొన్ని నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. ఆయా గ్రామాల సర్పంచులు సంబంధించిన అధి కారులు, ప్రజలు అప్రమత్తమై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రైతన్న కన్నీటి కష్టానికి కరుణించిన వానరుడు ఎంతో లాభం చేసినప్పటికి ఈదురుగాలులతో మండలంలో కొంత నష్టం జరిగిందని అధికారులు అంటున్నారు. రాత్రివేళ సైతం కమలాపూర్ సిఐ నవీన్, ఎస్ఐ మధు, ఎస్ఐ దిలీప్, పోలీస్ సిబ్బంది మండలంలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

## గర్భిణులకు పండ్లు పంపిణీ

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని ధరావత్ తండాలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ధరావత్ అనిత రవీందర్ నాయక్ గర్భిణీ స్త్రీలకు పండ్లు, గాజులు, సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్వాడి టీచర్స్ ,గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఎన్నికలకు 17 నామినేషన్లు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జనగామ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, స్టేషన్‌ఘనపూర్ ఆర్డీవో కిరణ్ ప్రకాష్ గురువారం తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో గాదె కేథరిన్, డా. డి లవకుమార్‌రెడ్డి, కృష్ణ జీవన్ బజాజ్, పెండెల శ్రీనివాస్, పెరువారం ప్రభాకర్, కెపరుశరాములు, డా. పిట్ట సత్యం, దొంతుల శేఖర్, పప్పు వెంకట్రెడ్డి, మేకపోతుల ఆంజనేయులు, ఏనుగుల ప్రభాకర్‌రెడ్డి, బనాసి రజని, వేముల్ల నర్సింహారెడ్డి, చారబుడ్ల సురేందర్‌రెడ్డి, జైనా రమేష్, అంబటి హేమంతరాజు, ఎస్ శివరాజ్ యాదవ్ ఉన్నారు.

# నిరుపయోగమైన రోడ్లపై బిజెపి నిరసన

మరమ్మతులు చేపట్టాలని
పేరం గోపిక్రిష్ణ డిమాండ్



**ప్రజాపక్షం/ హనుమకొండ టౌన్ :** హనుమకొండ కొత్త బస్టాండ్ ప్రాంగణంలో గుంతలు పడి, వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్న రోడ్ల దుస్థితికి నిరసనగా భారతీయ జనతా పార్టీ నాయకులు పేరం గోపిక్రిష్ణ ఆధ్వర్యంలో గుంతమడుగు జల్లి నిరసన కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ లోపలికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నిరసిస్తూ గుంతల్లో జల్లేసి, ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు పేరం గోపిక్రిష్ణ మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, వందలాది ఆర్టీసీ బస్సులు వచ్చి వెళ్లే హన్మకొండ కొత్త బస్టాండ్ ఆవరణ కనీస సంరక్షణ కరువై అధ్వానంగా తయారైందని మండిపడ్డారు. అధికారులు, పాలకులు ఈ సమస్యను పట్టించుకోకపోవడం వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌టిసియాజమాన్యం, స్థానిక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు.రవాణా శాఖ, ఆర్‌టిసిఅధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్ ప్రాంగణంలోని రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రయాణికులు, ప్రజల పక్షాన బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రయాణికులు పాల్గొన్నారు.

# జూనియర్ అథ్లెటిక్స్ సత్తా చాటిన సుస్మిత



**ప్రజాపక్షం/నెక్కొండ:** జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో నెక్కొండ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన అల్లం సుస్మిత సత్తా చాటింది. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన హనుమకొండ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మూడు విభాగాల్లో పతకాలు సాధించి ప్రతిభ కనబరిచింది. అల్లం రాజ్ కుమార్ రమ దంపతుల కుమార్తె సుస్మిత ప్రస్తుతం వరంగల్ డిఫెన్స్ అకాడమీలో మొదటి సంవత్సరం చదువుతోంది. పోటీల్లో 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించింది. మూడు విభాగాల్లోనూ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల అకాడమీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ కరస్పాండెంట్ కొండేటి సురేందర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ దెబ్బేట మహేష్, డైరెక్టర్లు పల్లె రాజు, కొమ్మినేని సందీప్ పటేల్, అమరేందర్ రెడ్డి, పంజాల గోపాల్, బడిదల కార్తీక్ తో పాటు అధ్యాపక బృందం సుస్మితను, ఆమె కోచ్ మహిపాల్‌ను అభినందించారు. ఆమె విజయాలతో వరంగల్ డిఫెన్స్ అకాడమీకిమంచిగుర్తింపులభించిందనిపేర్కొన్నారు.

# ఉద్యమకారుల 9 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/కమలాపూర్:** గత తొమ్మిది సంవత్సరాల నుంచి తెలంగాణ ఉద్యమకారుల కొరకు అలుపెరుగని పోరాటం చేస్తున్న డాక్టర్ సీమ శ్రీనివాస్ నాయకత్వంలో యాదగిరిగుట్ట వద్ద నిర్వహించనున్న 9 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసేందుకు ఉద్యమకారులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమలాపూర్ మండల అధ్యక్షులు మౌటం సంపత్ విజ్ఞప్తి చేశారు. కమలాపూర్ కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంపత్, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తుమ్మ శోభన్ బాబు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా ప్రభుత్వం కేకే కమిటీలతో కాలయాపన చేయవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం రోజు అధికారికంగా ప్రకటన చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతి సర్పంచ్ పబ్బు సతీష్, ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, కనుకుంట్ల అరవింద్, వలిగే సాంబరావు, పాక కుమారస్వామి, పచ్చిమట్ల కుమార్ పాల్గొన్నారు.

# ఐఒడిసిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సమీక్షా సమావేశం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి
శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై
మంత్రి సీతక్క సమీక్ష

**ప్రజాపక్షం/హనుమకొండ :** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క సమీక్ష నిర్వహించనున్నారు.శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు హన్మకొండ ఐఒడీసీలో ఈ సమీక్షా సమావేశం జరగనుంది.ఈ సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అక్టోబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన నివారణ, ముందస్తు చర్యలు, అలాగే సంబంధిత కార్యాచరణ ప్రణాళికపై ప్రధానంగా సమీక్షించనున్నారు.అదేవిధంగా, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఇతర భవనాల నిర్మాణ పనుల పురోగతి, వాటి పూర్తి స్థితి, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో చర్చించనున్నారు.హ్యామ్ (హెచ్ఏఎం) రహదారుల నిర్మాణ పనుల పురోగతి, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి, పెండింగ్ పనులు, భవిష్యత్ కార్యాచరణపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు.ఈ సమీక్షా సమావేశానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ఈఎన్ సీ లు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన అడిషనల్ కలెక్టర్లు, జిల్లా పరిషత్ సీఈఓలు, డీఆర్డీఓలు, డీపీఓలు, ఈఈలు, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొననున్నారు.సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ శాఖలకు సంబంధించిన తాజా గణాంకాలు, పురోగతి నివేదికలు, పెండింగ్ పనుల వివరాలు, పూర్తి చేయడానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికతో హాజరు కావాలని స్పెషల్ సీఎస్ దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు.

# బాలిక సదనం నుంచి మరో దత్తత: కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ బాలిక సదనం లో రక్షణ సంరక్షణ విద్యా బుద్ధులు నేర్చుకొని తన ఇష్టాలకు అనుగుణంగా దత్తతకు ఒప్పుకొని కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రోజున నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు కలెక్టర్ ఛాంబర్ లో చట్టబద్ధమైన దత్తత అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరమని అన్నారు.కాగా దత్తత కి ఇచ్చిన బాలికతో, దత్తత తీసుకున్న తల్లితండ్రులతో కలెక్టర్ మాట్లాడి దత్తత తీసుకొన్న బాలికను బాగా చదివించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎం కల్యాణి, ఇంచార్జి డిసిపివో ఎస్ ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

# ‘యుద్ధ భూమి కాకతీయ యూనివర్సిటీ’ ఫుల్ సాంగ్ విడుదల

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ 50 వసంతాల సందర్భంగా యూనివర్సిటీ ఆడిటోరియంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర చేతులమీదుగా సాంగ్ విడుదల చేయడం జరిగింది. 50 సంవత్సరాల కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భావం నుండి నేటి వరకు చరిత్రను, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం కొట్లాడిన విద్యార్థి పోరాటం, మహనీయులు కలలుగన్న సమాజాన్ని విద్యార్థులు అందిపుచ్చుకునే సామాజిక కార్యక్రమాల విధానం గూర్చి యూనివర్సిటీ లో పరిశోధక పరిశోధనలు ఉన్నతమైన చదువును కలగలిపి యూనివర్సిటీ ఉన్నతిని కొనియాడే విధంగా పాట రాశారు. 50 సంవత్సరాల కాలంలో మొట్ట మొదటిసారిగా ఈ పాట రాయడం విశేషం. ఈ పాట నేరెళ్ల దేవేందర్ వ్రాయగా ఇనుగుర్తి మధు పాడటం జరిగింది. ఈ యూనివర్సిటీ పాటకు సహకరించిన రాచకొండ ప్రవీణ్ ,గుంపెల్లి గౌతమ్, నిర్మాతలు ఎల్లూరి సాయికుమార్ శ్రీనాథ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్, ఎడిటర్ ఆర్య అరవింద్, డిఓపి అరవింద్ నాని, డ్రోన్ పైలెట్ దేశెట్టి నవీన్ ట్యూన్ పాక రాజ్ కుమార్‌కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై బిఆర్ఎస్ పోరుబాట

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** భూపాలపల్లి కెటిపిపి థర్మల్ పవర్ ప్లాంట్ సందర్శనకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపుతో ఆయన వెంట జిల్లా బిఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. విద్యుత్ కోతలు, కెటిపిపిలో ఉత్పత్తి తగ్గడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సింగరేణి బకాయిలు చెల్లించి విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, తీగల దయాకర్, ఏల సుందర్, కొల్లూరి సోమన్న, రవి, నవీన్ నాయక్, తదితరులు పాల్గొన్నా రు.

## హోరాహోరీగా రగ్బీ పోటీలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** జిల్లా స్థాయి అస్మిత రగ్బీ టోర్నమెంట్స్ మండలంలోని చెన్నూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. 15 ఏళ్ల బాలికల విభాగంలో 12, 18 ఏళ్ల విభాగంలో 8 జట్లు పాల్గొన్నాయి. 15 ఏళ్ల విభాగంలో ఎంజేపీ రఘునాథపల్లి ప్రథమ, కేజీబీవీ పాలకుర్తి ద్వితీయ, మహర్షి విద్యామందిర్ చెన్నూర్ తృతీయ స్థానాలలో నిలిచాయి. 18 ఏళ్ల విభాగంలో కేజీబీవీ పాలకుర్తి ప్రథమ, టీఎడబ్ల్యూఆర్ఎస్ గూడూరు ద్వితీయ, ఎంజేపీ రఘునాథపల్లి తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతమల్ల గణేష్, తెలంగాణ రాష్ట్ర రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషు, తదితరులు బహుమతులు అందజేశారు. మహర్షి విద్యా మందిర్ బాధ్యులు వెంకటాచారి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మహా అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/జనగామ:** పట్టణంలోని 24వ వార్డులో జైహనుమాన్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జాయ మల్లేష్, టౌన్ ప్రెసిడెంట్, కౌన్సిలర్ దోర్నాల అనిత వెంకటేశ్వర్లు, 24వ వార్డు ప్రెసిడెంట్ గాజుల శేఖర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సోమ సాయిరాం, దేవేందర్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## షాట్ సర్క్యూట్‌తో కిరాణాషాపు దగ్ధం



ప్రజాపక్షం/శివ్వంపేట : విద్యుత్‌షాక్ సర్క్యూట్‌తో శివ్వంపేటలో కిరాణాషాపు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం శివ్వంపేటకు చెందిన కంఠాల హనుమంతుగుప్తాకు చెందిన కిరాణా షాపు గురువారం ఉదయం 4గంటల ప్రాంతంలో మంటలు చెలరేగి షాపు దగ్ధమైంది. స్థానికులు స్పందించి ఫైరింజన్‌కు ఫోన్ చేయగా మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే షాపులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. తమకు రూ. 40లక్షల విలువైన సామాగ్రి దగ్ధమైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ లైన్ తీగ లతో షాక్‌కు గురైన వృద్ధుడు ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా మేడ్చల్‌లోని ఓ ఆసుపత్రికి చికిత్సకై తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జడ్చర్ల తండాలో ఉచిత హెల్త్ క్యాంప్



ప్రజాపక్షం / నిజాంపేట్ : నిజాంపేట మండలంలోని జడ్చర్ల తండా గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ ఉచిత హెల్త్ క్యాంప్ సర్పంచ్ బాబు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించే విధంగా మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపులో నిర్వహించడం జరుగుతుందన్నారు. దాదాపు 100 మందికి జనరల్ టెస్టులు నిర్వహించడం జరిగిందని అవసరం ఉన్నవారికి మెడిసిన్స్ పంపిణీ చేశామని తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

ప్రజాపక్షం / నిజాంపేట్ : నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం నిర్వహించారు. పోషణ మాసం సందర్భంగా తల్లులు రకరకాల పోషకాలతో కూడిన వంటలు తయారు చేసుకొని తీసుకురావచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐ సి డి ఎస్ సూపర్వైజర్ లక్ష్మీ హాజరై మాట్లాడుతూ పిల్లల నుండి పెద్దల వరకు ఆకుకూరలు, పండ్లు మంచి పోషకాహారం చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల స్వప్న, వార్డు సభ్యులు ప్రైమరీ స్కూల్ టీచర్స్,ఆశ వర్కర్స్, అంగన్వాడి టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



ప్రజాపక్షం/నర్సాపూర్ : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (TPF) రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరి మురళి డిమాండ్ చేశారు. విద్యను కాపాడుకుందాం నినాదంతో టీపీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర గురువారం సాయంత్రం నర్సాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా నర్సాపూర్ లోని ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించి, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. బడ్జెట్ లో విద్యారంగానికి 18 శాతం నిధులు కేటాయించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజన, పద్మజ, రిటైర్డ్ డీఎస్పీ విజయ్ కుమార్, డీపీఎఫ్ శంకర్, నాయకులు సంజీవ్, శివ, రామచందర్, నాగరాజు, ఉపాధ్యాయులు సామ్యా నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 10 కిలోమీటర్లు 10 మూలమలుపులు ప్రమాదకరంగా



ప్రజాపక్షం/ రేగోడ్: మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం కొండాపూర్ అల్లాదుర్గం రోడ్డు రహదారిపై ప్రయాణం వరుసగా ఎదురయ్యే మూలమలుపులు వాహనదారులకు పెద్ద సవాలుగా మారుతున్నాయి మార్గమధ్యంలో అనేక మూలమలుపులు ప్రమాదకరంగా ఉండటంతో రోజుకు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు ప్రతి మూలమలుపు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు ఎదురుగా ఏమొస్తుందో తెలియని పరిస్థితి. అల్లాదుర్గం వెళ్లడానికి పది మూలమలుపులు ఉన్నాయని నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు భద్రతపై చర్యలు చేపట్టలని కోరుతున్నారు ప్రమాదాలు సంబంధం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు మూలమల్పులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు గ్రామ ప్రజలు కోరుతున్నారు

## బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, నర్ర రవి మృతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, భవన నిర్మాణ సంఘం కార్మిక నాయకులు నర్ర రవి హార్ట్ స్ట్రోక్ తో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి లో చికిత్స పొందుతు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు యశోద ఆసుపత్రి కి చేరుకొని మృత దేహానికి నివాళ్లు అర్పించారు, శోక సంద్రం లో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు, ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.. నర్ర రవి మృతి బాధాకరమని, బి ఆర్ ఎస్ పార్టీ కి, ముదిరాజ్ సమాజానికి, భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల కు తీరని లోటని, ఎంతో మంది కార్మికులకు ఉపాది కల్పించారని, పార్టీ కి, కార్మికుల కు చేసిన సేవలను కొనియాడారు, పార్టీ కి తీరని లోటన్నారు, కుటుంబానికి అన్ని విధాలుగా అండగ ఉంటానని, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం రూ.7.20 కోట్లతో రోడ్డు పనులకు



ప్రజాపక్షం/అల్లాదుర్గం: అల్లాదుర్గం మండల కేంద్రం పోచమ్మ గుడి నుండి జగిర్యాల ఎక్స్ రోడ్ పివి డబ్ల్యూ వరకు7.20 కోట్లతో రోడ్డు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఆదేశానుసారం గురువారం వట్పల్లి మార్కెట్ కమిటీ చైర్పర్సన్, కొప్పుల లక్ష్మీ శేషారెడ్డి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ డి ఈ విల్సన్, ఏ ఈ రమేష్, సీనియర్ నాయకులు సుభాష్ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి, డిసిసి కార్యదర్శులు బాల కిషన్, అంజా గౌడ్, మెదక్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బలరాం, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, హరికృష్ణ, వీరన్న, శంకర్ నాయక్, నరసింహులు, శేఖర్, ప్రభు, భూమ్ రెడ్డి, బేతయ్య, జైపాల్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## "పోషకాహారం తీసుకుందాం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం"...

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: "పోషకాహారం తీసుకుందాం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని ఎన్సాన్‌పల్లి గ్రామ సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్‌గౌడ్ పిలుపునిచ్చారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గురువారం పోషణ మాసంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు,మహిళలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. పోషకాహార లోపం లేకుండా ప్రతి కుటుంబంలో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పల్‌కు ప్రొఫెసర్ హోదా..

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పల్ డా.జీవన్ కుమార్‌కు డిగ్రీ కళాశాల క్యాడర్లో అత్యున్నతమైన ప్రొఫెసర్ హోదా లభించింది.కళాశాల విద్యా కమిషనరేట్ నుండి ఈ ప్రమోషన్ ఉత్తర్వులను అందుకోవడం సంతోషంగా ఉన్నట్లు ప్రిన్స్‌పల్ తెలియజేశారు.ఈ సుదీర్ఘ ప్రయాణంలో సహకారం అందజేసి ఎప్పటికప్పుడు ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక హృదయపూర్వక ధన్యావాదాలు తెలియజేశారు.

## కూచారం కెజిబివి పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



ప్రజాపక్షం/మనోహరాబాద్ : మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) లో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా గురువారం ప్రత్యేక కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) లో భాగంగా ఈ వైద్య పరీక్షలను చేపట్టినట్లు తూప్రాన్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ పి.ఎండ్.ఓ వీర్‌కుమార్,మొబైల్ హెల్త్ టీమ్ వైద్యురాలు డాక్టర్ సంగీత సంయుక్తంగా వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంగీత మాట్లాడుతూ విద్యార్థుల చదువుపై చూపు ప్రభావం పడకుండా ఉండేందుకు ముందస్తుగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో పాఠశాలకు చెందిన విద్యార్థినులకు నిష్ణాతులైన వైద్య బృందం ఆధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో దృష్టి లోపాలు, ఇతర కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించిన విద్యార్థినుల వివరాలను నమోదు చేసుకున్నామని, వారికి త్వరలోనే ప్రభుత్వ పరంగా ఉచితంగా కళ్ళద్దాలను (స్పెట్స్) అందజేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## సర్పంచ్‌ల స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ కు ఘన సన్మానం



ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట : తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచ్‌ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ధూళ్మిట్ట మండలం జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్‌ను స్టేట్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివచరణ్ రెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రీమతి ఆర్.కె. భావ్యశ్రీ ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచ్‌ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ, సర్పంచ్‌ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని కమలాకర్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, చెట్కూరి కమలాకర్ యాదవ్ అభిమానులు కమలాకర్ యాదవ్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాపక్షం/పాపన్నపేట : మండల కేంద్రం పాపన్నపేటలోని నవ యువ సేవా సంఘం. హనుమాన్ యువజన సంఘం లు ఏర్పాటు చేసిన గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఈశ్వరాలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నవ యువ సేవా సంఘం సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవయువ సేవా సంఘం సభ్యులు సుంకరి ఆంజనేయులు, విక్రమ్ రాజు, లడ్డు, టప్ప కృష్ణ, వంజరి రాజ్ కుమార్, విట్ల శ్రీనివాస్, రాజేష్, శివశంకర్, పృథ్వీరాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నగా పాత పోస్ట్ ఆఫీస్ వద్ద హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శ్రీరామ్ సురేష్ దంపతులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దుర్గేష్, శ్రీకాంత్, అంబాజీ, శివ, నవీన్, శ్రీను, యాదగిరి, బేతయ్య, దశరథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ




ప్రజాపక్షం / నిజాంపేట్ : నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ నాతి అంజమ్మ లక్ష్మి గౌడ్, ప్రధానోపాధ్యాయులు సత్యం రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌ల పంపిణీ ద్వారా విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మమత, ఉప సర్పంచ్ దేవరాజ్, వార్డు సభ్యులు, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్, మైనార్టీ నాయకులు సులేమాన్ , శ్రీనివాస్, ఎల్లారెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ప్రజాపక్షం/రేగోడ్: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అగ్రిస్టాక్ ద్వారా రైతులకు ప్రత్యేక ఫార్మర్ ఐడీ జారీ చేయనున్నట్లు రేగోడ్ మండల వ్యవసాయాధికారి శ్రీదేవి అన్నారు సెప్టెంబర్ 22–30 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంట కొనుగోళ్లు, రుణాలు, పీఎం కిసాన్ తదితర ప్రయోజనాలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఆధార్, పాస్‌బుక్, మొబైల్ నంబరుతో వ్యవసాయ కార్యాలయం, మీ సేవా, సీఎస్‌సీ కేంద్రాల్లో నమోదు చేసుకోవని తెలిపారు

## ప్రతిభ కనబరిచిన ప్రణవి బృందానికి హిందూ వాహిని పురస్కారం



ప్రజాపక్షం/గణపురం: గణపురం మండలంలోని పరశురాంపల్లి గ్రామానికి చెందిన ఉడుత సంధ్య తిరుపతి దంపతుల కుమార్తె ప్రణవి బృందం ఉత్తమ ప్రతిభ కనబరిచి హిందూ వాహిని ఆధ్వర్యంలో పురస్కారం అందుకున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రణవికి జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రణవిని అభినందించారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- కలెక్టర్ సందీప్ కుమార్



ప్రజాపక్షం/జనగామ టౌన్: గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టిన సమగ్ర అభివృద్ధి సాధించడమే వికసిత్ గ్రామ పంచాయితి ప్రణాళిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లో సర్పంచ్‌లు, పంచాయితి కార్యదర్శులకు ప్రణాళిక అమలుపై శిక్షణ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంలు, రీచార్జ్ పిట్లు, డ్రిప్ ఇరిగేషన్, మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, పంచాయితి భవనాలు, పారిశుద్ధ్యం, సోలార్, తదితర మౌళిక వసతుల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులు భాస్కర్, సూరి, భాస్కర్, అంబికా సోని, వెంకటరెడ్డి, రాణా ప్రతాప్, మురళీధర్‌రావు, రవీందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ సమర శంఖం




ప్రజాపక్షం/చేర్యాల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మన్ అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని వాసవి గార్డెన్ లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా 5వ మహాసభలకు పుట్ట లక్ష్మన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభల సందర్భంగా చేర్యాల పట్టణ కేంద్రంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున విద్యార్థుల హక్కుల కోసం నినాదాలు చేస్తూ విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్ జెండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకుని ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో విద్యార్థుల సమస్యలపై నిరంతర కార్యక్రమాలు చేపడతామని మంద పవన్ తెలిపారు. ఈ మహాసభ కార్యక్రమంలో మాజీ నాయకులు బుట్ట దయానంద్ రెడ్డి, స్వర్గం రాజేశం, నర్సింహారెడ్డి, జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు సంగెం మధు, జేరిపోతుల జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్, సహాయక కార్యదర్శులు వేల్పుల ప్రసన్న కుమార్, చిట్యాల శేఖర్ తో పాటుగా జిల్లా, మండల నాయకులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు మరియు పరిసరాలను సిపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ రాజేష్, ఎస్ఐ సతీష్ మరియు పోలీస్ సిబ్బందికి సిపి పలు కీలక సూచనలు జారీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని, నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ తనిఖీ అనంతరం మిరుదొడ్డి మండలంలో ఏర్పాటు చేసిన ఒక గణేష్ మండపాన్ని సీపీ సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

## వినాయక నిమజ్జనాలను పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు



ప్రజాపక్షం/ సంగారెడ్డి : జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు ప్రశాంతగా జరిగేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రధాన నిమజ్జన ప్రాంతాలైన చెరువులు ,కుంటలు, శోభాయాత్ర మార్గాలను ముందుగానే గుర్తించి భద్రతా ఏర్పాట్లు సమీక్షించడం జరిగిందని నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్ ,లైటింగ్ క్రేన్లు, గజఈతగాళ్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ రోడ్ల పరిస్థితి అవసరమైన మరమ్మతులు ,విద్యుత్ వైర్ల లైటింగ్ తదితర అంశాలను సంబందిత శాఖల సమన్వయంతో పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రజలకు భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

**నిమజ్జనం సందర్భగా పోలీసుల సూచనలు**

: నిమజ్జనం సందర్భంగా బారికేడ్లను దాటి నీటిలోకి వెళ్లకూడదని ముఖ్యంగా పిల్లలు ,మహిళలు ,వృద్ధుల విషయంలో నిర్వాహకులు ,కుటుంబ సభ్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి ,శోబా యాత్రల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలను నిలివేయకూడదని ప్రమాదకర వస్తువులు నిషేధిత సామిగ్రి ఊరేగింపుల్లో వినియోగించకూడదు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం వాహనాలు నడపడం వంటి చర్యలు దూరంగా ఉండాలి. విద్యుత్ వైర్లను చేతులతో గాని కర్రలతో గానీ తాకకుండా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు.

## జర్నలిస్ట్ కొప్పు నర్సింహులు కు ఘన నివాళులు



ప్రజాపక్షం/ హత్నూర : హత్నూర మండలం స్వర్గీయ జర్నలిస్టు కొప్పు నర్సింలు 10వ వర్ధంతి సందర్భంగా గురువారం దౌల్తాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన జర్నలిస్టులు అనంతరం జర్నలిస్టు మిత్రులు మాట్లాడుతూ కొప్పు నర్సింలు ఒక జర్నలిస్టుగా సమాజంలో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అని గుర్తు చేశారు. నిజాన్ని నిర్భయంగా వార్తలు వ్రాస్తు ప్రజలకు ప్రభుత్వానికి వారిధిగా నిలిచారన్నారు. ఆయన తన 30 సంవత్సరాల జర్నలిస్టు వృత్తిలో మండలంలోనే ఒక మంచి పేరు తెచుకున్న వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బి.రామస్వామి, వీనం పల్లి కిషన్‌రావు ,కొమరగోల్ల నగేష్, కురుమ యాదవ్, రావుల కొర వెంకటేష్ గౌడ్ నాయికోటి నిరుడి బిక్షపతి పరమేశుల కృష్ణ, జైన సత్యం పేటేల్ పోచగౌడ్, శ్రీను సత్యం కరీముద్దీన్, వీరేశం దస్తగిరి అబ్బుల్లా జావిద్ దాసు తదతరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ బకాయిలపై విజిలెన్స్ కొరడా..?

ప్రజాపక్షం/రామాయంపేట: ప్రభుత్వానికి అందించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) బకాయిల వ్యవహారంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో మెదక్ జిల్లాలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు మళ్లీ వేగం పుంజుకున్నాయి. సిఎంఆర్ బియ్యం అప్పగించకుండా బకాయిలు పేరుకుపోయినట్లు అనుమానిస్తున్న రైస్‌మిల్లులపై అధికారులు వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు రైస్‌మిల్‌పై దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. మిల్లులో ధాన్యం నిల్వలు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం లేకపోవడంతో అధికారులు చర్యలకు దిగారు. తనిఖీల్లో సుమారు 29వేల వడ్ల బస్తాలు 3.20కోట్ల విలువైన బస్తాలు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. దీంతో పంచనామా నిర్వహించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా సదరు వ్యాపారి చట్టపరమైన చర్యలు, అరెస్ట్ జరిగే అవకాశం ఉందన్న ఆందోళనతో భార్యతో కలిసి పరారీలో ఉన్నట్లు తెలిసింది. హైకోర్టును ఆశ్రయించి ముందస్తుగా బెయిల్ తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై స్థానిక సిఐ సైదాను వివరణ కోరగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని, హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసిందని తెలిపారు. సివిల్ సప్లయి అధికారులు నేడు (శుక్రవారం) స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

## అంతర్జాతీయ వయోవృద్దుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ సంగారెడ్డి : కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ వయోవృద్దుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ వయోవృద్దుల వారోత్సవాలలో బాగంగా గురువారం అదనపు కలెక్టర్ పాండు ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్దుల వారోత్సవాలుపోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నుంచి అక్టోబర్ ఒకటో తారీఖు వరకు వారోత్సవాలలో వయోవృద్దులందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయగలరని కోరినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి దివ్యాంగులు,వయోవృద్ధులు, సంక్షేమ శాఖ అధికారులు సీనియర్ సిటిజన్స్ ఖాజా మొయినుద్దీన్,హనుమప్ప శ్రీశైలం ,లక్ష్మయ్య, సంగప్ప, మల్లప్ప, సుదాకర్, ఉమాపతి, మధు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జనగం శంకర్ నియామకం..

ప్రజాపక్షం/బెజ్జంకి : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మెన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు సిద్దిపేట ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన జనగం శంకర్‌ను నియమిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి,ఉపాధ్యక్షులు సముద్రాల లక్ష్మణ్,తప్పెట శంకర్‌లు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి అర్హులైనవారికి అందేవిధంగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో ఎన్నికకు సహకరించిన మానకొండూర్ ఎంఎల్ఏ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మెన్ కవ్వంపల్లి సత్యనారాయణకు,రాష్ట్ర,మండల నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నీట్ పిజీలో 3413 ర్యాంకు సాధించిన హర్షితరెడ్డి



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన ఎడ్ల హర్షితరెడ్డి నీట్ పిజి పరీక్షలో 3413 ర్యాంకు సాధించింది. చిన్నకోడూరు మండలం ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి శ్రీలత కుమార్తె ఎడ్ల హర్షిత రెడ్డి ఈరోజు ప్రకటించిన నీట్ పిజి పరీక్షలో 3413 సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఈ పిజి పరీక్షలో 268000 పాల్గొనగా మూడు వేల పైగా ర్యాంకు సాధించినందుకు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా హర్షిత రెడ్డి మాట్లాడుతూ గాంధీలో డాక్టర్ పూర్తి చేసుకున్న తను దేశవ్యాప్తంగా నిర్వహించిన పీజీ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

## గుర్తు తెలియని చిన్నారి-తల్లిదండ్రుల కోసం పోలీసుల గాలింపు



ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం సమీపంలో సుమారు 2 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని చిన్నారి ఒంటరిగా కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నర్సాపూర్ పోలీసులు వెంటనే స్పందించి చిన్నారిని తమ సంరక్షణలోకి తీసుకున్నారు. ప్రస్తుతం చిన్నారి తల్లిదండ్రుల వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. చిన్నారిని గుర్తించిన వారు లేదా తల్లిదండ్రుల ఆచూకీ తెలిసిన వారు వెంటనే నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి (87126 57941) లేదా నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ సమాచారాన్ని విస్తృతంగా షేర్ చేసి చిన్నారి తల్లిదండ్రులను చేర్చడంలో సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా గణపతి నిమర్జనాలు

**ప్రజాపక్షం, కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంతో పాటు ఉప్పల్, దేశరాజుపల్లి, శనిగరం, గోపాల్‌పూర్ పలు గ్రామాలలోని వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో భక్తులు భజనాలు చేస్తూ ఊరేగింపుగా గణనాధుని తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనాలు అవంతరాలకు తావు లేకుండా శాంతియుతంగా నిమజ్జనాలు జరిగాయి.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/గణపురం:** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన గణపురం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు కథనం ప్రకారం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు (40) ఇంటి ముందున్న వేప చెట్టు కొమ్మలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రేకుల షెడ్డుపైకి వాలాయి. దీనితో రాజు గొడ్డలితో వాటిని నరికేందుకు చెట్టెక్కాడు. కొమ్మలను నరుకుతుండగా ప్రమాదశాత్తు సమీపంలోని 11 కెవి విద్యుత్ తీగలకు తగిలాయి. దీనితో తీవ్ర విద్యుద్ఘాతానికి గురైన రాజు చెట్టుపేనే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు వెంటనే స్పందించి చెట్టుపై నుండి కిందకు దించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలకేంద్రంలోని 9 వ వార్డులో జియ్యారి మదునమ్మ సంవత్సరిక కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్,ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘం చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి పాల్టొని మదునమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దంచికొట్టిన భారీ వర్షం

**ప్రజాపక్షం/గూడూరు;** గూడూరు మండల వ్యాప్తంగా గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో రైతాంగంలో కొత్త ఉత్సాహం నెలకొంది మొన్నటి వరకు సరైన వర్షాలు లేక ఆందోళన చెందిన రైతన్నలకు ఈ వర్షం ప్రాణం పోసినట్లయింది. మండలంలోని పలు గ్రామాల్లో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా చెరువులు కుంటల్లోకి భారీగా వరద నీరు చురుకుంటోంది.

**చెరువుల్లోకి 30 శాతం నీరు**

వర్ష తీవ్రతకు మండలంలోని ప్రధాన సాగు నీటి చెరువుల్లోకి సుమారు 30 శాతానికి పైగా కొత్త నీరు చేరింది.ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రహాహం వస్తుండటంతో జలాశయాలు కళకళలాడుతున్నాయి.ఇదే జోరు మరో రెండు రోజుల పాటు కొనసాగితే ప్రధాన చెరువులన్నీ నిండి ఆలుగులు (మత్తళ్లు) పారడం ఖాయమని స్థానిక రైతులు ధీమా వ్యక్తం చుస్తున్నారు.

# సేవాభావంతోనే సమాజ ప్రగతి

### ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ప్రిన్సిపాల్ బి శ్రీదేవి



**ప్రజాపక్షం/చిట్యాల:** సేవాభావం అలవర్చుకోవడం ద్వారా సమాజ ప్రగతికి దోహదపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం యుగంధర్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుకోవాలని సూచించారు. నాట్ మీ..బట్ యూ నినాదానికి అనుగుణంగా వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, రక్తదానం, ఆరోగ్య అవగాహన, అక్షరాస్యత, వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ ఎం యుగంధర్‌లను ఘనంగా సన్మానించారు. కళాశాల పూర్వ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హెచ్ కర్ణాజీవిని సైతం సన్మానించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మతాలతీతకంగా మానవత్వం... గణనాథుడి సేవలో ముస్లిం బాలుడు



**ప్రజాపక్షం/నెక్కొండ:** మతాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని దేవుడి పేర్లు వేరైనా సేవాభావం ఒక్కటేనని చాటిచెప్పాడు ఓ ముస్లిం బాలుడు..వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర బస్టాండ్ సమీపంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ కుమారుడు మహమ్మద్ రెహాన్ పాల్గొని తనవంతు సేవ చేశాడు. అన్నదానానికి వచ్చిన భక్తులకు ప్లేట్లు అందిస్తూ, మంచినీరు పోస్తూ చిన్నారి రెహాన్ ఉత్సాహంగా సేవలందించాడు. తన మతాన్ని పక్కనబెట్టి, దేవుడి సేవలో మానవత్వంతో భాగస్వామి కావడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. చిన్నారి రెహాన్ చేసిన సేవను చూసిన గ్రామస్తులు అభినందించారు. మతాల పేరుతో మనుషుల మధ్య దూరాలు పెంచుకునే రోజుల్లో..ఒక చిన్నారి తన చేతల ద్వారా చెప్పిన మత సామరస్య సందేశం అందరికీ ఆదర్శంగా నిలిచింది. అన్నదానం ఆకలిని తీర్చినట్లే..రెహాన్ చూపిన మానవత్వం మనుషులను కలిపింది. గణపతి మండపంలో ముస్లిం బాలుడు చేసిన ఈ సేవ మతం మనిషిని విడదీయకూడదు..మానవత్వం మనుషులను కలపాలి అనే సందేశాన్ని చాటి చెప్పింది. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామ సర్పంచ్ కొల లక్ష్మణ్, కాశబోయిన మల్లయ్యా, పైండ్ల రాములు, నంచర్ల లక్ష్మణ్‌చారి, మండే నరసయ్యా, బోనాల సమ్మయ్యా, కుంట సాయిలు మాట్లాడుతూ చిన్న వయసులోనే రెహాన్ చూపిన సేవా స్ఫూర్తి, సోదరభావం అభినందనీయమని, ఇలాంటి సంఘటనలు సమాజంలో మత సామరస్యం, పరస్పర గౌరవం, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని వారు పేర్కొన్నారు.

## మట్టిగణపతితో ఊరేగించి నిమజ్జనం చేసిన చిన్నారులు



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా సమీపంలో చిన్నారులు పర్యావరణ హితంగా గణేష్ నవరాత్రి వేడుకలను నిర్వహించి అందరిని ఆకర్శించారు.ప్రకృతిలో సహజ సిద్దంగా లభించే మట్టితో స్వయంగా వినాయక విగ్రహాన్ని తయారు చేసి తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్దలతో ,సాంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించి చివరి రోజున గణపతిని పల్లకిలో ఊరేగిస్తూ భక్తి గీతాలతో చేసిన సందడి చేశారు.ఈకార్యక్రమానికి గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి హాజరై వినాయకుని పూజాకార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.గ్రామంలో చిన్నారులు వినాయకుని విగ్రహానికి ఎలాంటి కాలుష్య రసాయన రంగులు లేకుండా సహజ సిద్దంగా మట్టితో వినాయకుని విగ్రహం తయారు చేసి సాంప్రదాయ పద్దతులతో నవరాత్రి పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనాన్ని పల్లకిలో తీసుకొని భజనలు చేస్తూ ,భక్తిగీతాలు ఆలపిస్తూ రేగింపుగా వెల్లి నిమజ్జనం చేయడం గ్రామస్తులను ఆలోచింపచేశాయని తెలుపుతూ వాతావరణ కాలుష్యం లేకుండా నిమజ్జనం చేయడం అభినందనీయమని కొనియాడారు.కార్యక్రమంలో గ్రామస్తులు,చిన్నారులు,వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులుగా ఇద్దరు నామినేషన్ దాఖలు

**ప్రజాపక్షం, తొర్రూరు :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లా పాలకవర్గ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నామినేషన్ల కార్యక్రమాన్ని చేపట్టగా జిల్లా పాలకవర్గ ఎన్నికల్లో తొర్రూరు డివిజన్ నుంచి సభ్యులుగా తమ్మెర విశ్వేశ్వర్‌రావు, రేగూరి వెంకన్నలు నామినేషన్లు దాఖలు చేశారు. తొర్రూరు డివిజన్ పక్షాన పాలకవర్గ సభ్యులుగా తమ్మెర విశ్వేశ్వర్‌రావును తమ్మెర వీరభద్రరావు, కడారి జయసింహారెడ్డి బలపర్చారు. మరొక పాలకవర్గ సభ్యుడు రేగూరి వెంకన్నను నాళ్ల మల్లికార్జున్, వై.గోవిందరాజులు బలపర్చి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నిక ఏకగ్రీవమైతే ఈ నెల 26న మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యుల ప్రమాణ



స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలో మహబూబాబాద్, కేసముద్రంతో పాటు పలు ప్రాంతాల నుంచి 13మంది పాలకవర్గ సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేసినట్లు చెప్పారు.

## అంగన్వాడీ నియామకాల ధృవ పత్రాల పరిశీలన పూర్తి



**ప్రజాపక్షం/మహాదేవపూర్;** మహాదేవపూర్ సిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తల నియామకానికి సంబందిచి సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం పూర్తయిందని ఐసిడిఎస్ అఇధికారులు వివరించారు.నోటిఫికేషన్‌కు అనుగుణంగా ప్రాఎక్టు పరిధిలో మొత్తం 604 దరఖాస్తులు రాగా 428 తమ దరస్తులను సమర్పించారని హాజరైన అభ్యర్థుల పరిశీలన పూర్తైందని తెలిపారు.కొందరు అభ్యర్థులు స్థానికత లేకపోవడం,ఆసక్తి లేక వివిధ కారణాలతో దరఖాస్తులను సమరిపంచలేదని తెలిపారు.ఏవైనా ధృవ పత్రాలు సమర్పించని అభ్యర్థులు రెండు రోజుల్లోగా సమర్పించాలని అధికారులు సూచించారు.ధృవ పత్రాల పరిశీలనలో జిల్లా సంక్షేమ అధికారి డిడబ్ల్యూఓ మల్లేశ్వరి,పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో మొబైల్ వైద్య శిబిరం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆదిత్య బిర్లా ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయిబాబా మందిరంలో మొబైల్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మందిరానికి వచ్చిన భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు, భక్తులకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో మందిరం చైర్మన్ మోతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు వెయ్యి గండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్, సిబ్బంది నవీన్ మందిర సిబ్బంది సాయి కృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్ లో సిబినాట్ యంత్ర ఏర్పాటు పరిశీలన

**ప్రజాపక్షం, కమలాపూర్:** కమలాపూర్ ఆరోగ్య కేంద్రంలో క్షయ (టిబి) వ్యాధీ నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేసేందుకు సిబినాట్ యంత్రం ఏర్పాటు పై అధికారులు పరిశీలన చేపట్టారు. ఇంచార్జ్ డిటిసిఓ, డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సిహెచ్ఓ మాధవ రెడ్డి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గది, విద్యుత్ వసతులను పరిశీలించారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం గణేష్ నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన వైద్య, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించి అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి సూపరిండెంట్ డాక్టర్ చందు నాయక్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ అమృత, డాక్టర్ రమ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రుద్రాన్స్ పటేల్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/గణపురం:** మండలంలోని బసవరాజుపల్లి గ్రామ సర్పంచ్ చింతకుంట్ల సునీత శ్రీనివాస్ దంపతుల కుమార్తె తోట సుదీర రాజు దంపతుల కుమారుడు రుద్రాన్స్ పటేల్ మొదటి పుట్టిన రోజు వేడుకలు గురువారం ఆత్మకూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు. ప్రజా ప్రతినిధులు పాల్గొని చిన్నారని రుద్రాన్స్ పటేల్‌ను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో గణపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కరరావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ధర్మారావుపేట సర్పంచ్ పూజారి రాజేందర్, గాంధీనగర్ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్, అప్పయ్యపల్లి సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్, గండు దేవేందర్, అనిశెట్టి సంతోష్, లక్కం రాములు, కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉత్సవాలు

సర్పంచ్ కాసం రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదర్శంగా నిలిచిన లక్ష్మీ పూర్

ఎడ్లబండి శోభాయాత్రతో పాతకాలపు సంస్కృతికి పునర్జీవం





**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీ పూర్ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సరికొత్త ఆదర్శాన్ని చాటింది.పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ సంస్కృతి–సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఈ ఏడాది గణనాథుని ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రత్యేకంగా నిర్వహించారు.లక్ష్మీ పూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి పూజలు నిర్వహించారు.ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను గ్రామ సర్పంచ్ కాసం రాజశేఖర్ దగ్గరుండి పర్యవేక్షించారు.పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేందుకు ఈ ఏడాది గ్రామమంతటా కేవలం మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించేలా గ్రామస్థులను ప్రోత్సహించి, లక్ష్మీ పూర్ గ్రామాన్ని జిల్లాలోనే ప్రత్యేకంగా నిలిపారు. సంప్రదాయ శోభాయాత్ర:కేవలం ప్రతిష్ఠాపనలోనే కాకుండా, నిమజ్జన శోభాయాత్రలోనూ గ్రామం పాతకాలపు సంప్రదాయాన్ని ఆచరించి మరోసారి ప్రత్యేకతను చాటుకుంది.ఆధునిక వాహనాలకు భిన్నంగా, హనుమాన్ దేవాలయంలో పూజలందుకున్న వినాయక స్వామివారిని అత్యంత సుందరంగా అలంకరించిన ఎడ్లబండిపై ఉంచి ఊరేగించారు. గ్రామీణ కళలైన తమ్మడ–సన్నాయి, మంగళ వాయిద్యాల శబ్దాలు,భక్తుల కోలాటాలు,జయజయధ్వానాల మధ్య గ్రామ వీధుల గుండా భక్తిశ్రద్ధలతో శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం నిర్వహించారు . సంప్రదాయబద్ధంగా సాగిన ఈ నిమజ్జన వేడుకను చూసేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఆధునిక హంగులకు బదులుగా పూర్వీకుల కాలం నాటి గ్రామీణ సాంస్కృతి , సాంప్రదాయాలను గుర్తు చేసేలా శోభయాత్ర నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మట్టి విగ్రహాల వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇవ్వడంతో పాటు ,సాంప్రదాయ బద్ధమైన నిమజ్జన శోభాయాత్ర ల ద్వారా మన గ్రామీణ సంస్కృతిని భావితరాలకు అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు .ఇతర గ్రామాలు ,వినాయక మండపాల నిర్వాహకులు కూడా ఇలాంటి పర్యావరణహిత ,సాంప్రదాయ పద్ధతులను అనుసరించేందుకు ఇది స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు .పర్యావరణాన్ని కాపాడుకుంటూ,మన ప్రాచీన సంస్కృతిని నేటి తరానికి పరిచయం చేసేలా ఉత్సవాలు నిర్వహించిన గ్రామ పంచాయతీని, సర్పంచ్ కాసం రాజశేఖర్‌ను,గ్రామ ప్రజలను పలువురు అభినందిస్తున్నారు.

## ‘పోషణ్ మాసం’ వేడుకలు

**ప్రజాపక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయ్ గ్రామంలో పోషణ మాసం షెడ్యూల్లో భాగంగా స్థానిక అంగన్వాడి కేంద్రాలలో పోషణ్ మాసం వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సమాజంలో చిన్నారులు,గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ‘పోషణ్ మాసం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని,పిల్లలకు ఇంట్లోనే తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ సువర్ణ పిలుపునిచ్చారు. అనంతరం పోషకాహార అవగాహనపై వీధుల్లో ర్యాలీ నిరవ్వహించి, హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగవ్వ, పంచాయతీ కార్యదర్శి నా రాయణ ప్రాథమిక పాఠశాల టీచర్ ప్రశాంత్, అంగన్వాడీ టీచర్ యశోద,తల్లులు, కిశోర బాలికలు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వందేమాతరం గేయ అలాపన కార్యక్రమం

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలో ని శ్రీ సరస్వతీ విద్యాపీఠం అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఉన్న అన్ని శిశుమందిరాల ఆధ్వర్యంలో నమామి భారత్ సామూహిక సంపూర్ణ వందేమాతరం గేయ అలాపన కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ బైంసాలో నిర్వహిస్తున్నాము కావున ఈ కార్యక్రమంలో బైంసా పట్టణంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ ప్రబంధకారిని సభ్యులు, పుర ప్రముఖులు, హితైషులు, యువజన సంఘాల సభ్యులు అందరు తప్పకుండ రాగలరని మనవి .కార్యక్రమం ఉదయం 10గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణతో ప్రారంభమౌతుంది 11:00గంటలకు సంపూర్ణ వందేమాతర అలాపనతో పూర్తి అవుతుంది కావున మీరు 9:50ని లకు తప్పకుండ రాగలరిని మనవి.

## 27న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా సమావేశం



**ప్రజాపక్షం / వాంకిడి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షాభూమిలో ఈ నెల 27న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్ తెలిపారు. వాంకిడి మండల కేంద్రంలోని జెత్వన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27న మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఉత్తర తెలంగాణ భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు గడపాలే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞ కుమార్ రత్నఝూడే ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ మార్పులు చేర్పులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, ఆదాయ వ్యయాల నివేదికలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని బౌద్ధ బాంధవులు, ఉపాసకులు, అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.ఎస్. ప్రహ్లాద్ వైనేష్, ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, ఆర్గనైజర్ సిహెచ్. తుకారాం, క్యాషియర్ దుర్గం తిరుపతి, జాయింట్ సెక్రటరీ పెర్గు ఆత్మారాం, శ్యామ్‌రావు దుర్గే, పుల్లయ్య కాంబ్లే, సంతోష్ ఝూడే తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అపోహలు వీడండి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ఎయిడ్స్ పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాలని, సకాలంలో పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ పిలుపునిచ్చారు.నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లె సిద్దులు జన జాగృతి కళాజాత కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీమ్ నెం 2 కళాకారులచే జగిత్యాల వీక్లీ బజార్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూహెచ్ఐవి సోకినంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదని, ముందు జాగ్రత్త, అవగాహన చాలా ముఖ్యమన్నారు.హెచ్ఐవి ప్రధానంగా నాలుగు కారణాల వల్ల వ్యాపిస్తుందని, సురక్షితం కాని శృంగారం, కలుషిత రక్తం ఎక్కించడం, కలుషిత సూదులు, సిరంజిల వాడకం, హెచ్ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకు, షేక్ హ్యాండ్ ఇవ్వడం వల్ల, కలిసి భోజనం చేయడం వల్ల, దోమ కుట్టడం వల్ల, ఒకే మరుగుదొడ్డి వాడడం వల్ల హెచ్ఐవి వ్యాపించదని శ్రీనివా స్ స్పష్టం చేశారు.కళాకారుల సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లోకి తీసుకెళ్లాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.అనంతరం కళాకారులు బుర్రకథ, ఒగ్గుడోలు రూ పంలో హెచ్ఐవి నివారణపై పాటలు పాడి ఆకట్టుకున్నా రు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్లు, టీఎస్ఏసిఎస్ సిబ్బంది, స్థానిక ప్రజలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు.

## షాహిద్ కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలానికి చెందిన నమస్తే తెలంగాణా దిన పత్రిక పాత్రికేయుడు షాహిద్ మాతృమూర్తి కు ఇటీవల శాస్త్ర చికిత్స జరిగింది.విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్,ముధోల్ సమన్వయకర్త సమితి సభ్యులు లోలం శ్యామ్ సుందర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట బి ఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్,పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు,మాజీ ఎంపీపీ లక్ష్మి సాగర్,గ్రామ సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ దిగంబర్,మాజీ వైస్ ఎంపీపీ సాయన్న,సోషల్ మీడియా కన్వీనర్ బండి ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.

## జిల్లా టాపర్ శ్వేతకు పురస్కారం

**ప్రజాపక్షం / జన్నారం :** పదో తరగతి పరీక్షల్లో 582 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన కిస్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లసెట్టి శ్వేతకు రూ.2 లక్షల నగదు పురస్కారం లభించింది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ‘చదువుకో తెలంగాణ’ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఆమె గురువారం నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. మంచిర్యాల జిల్లా టాపర్‌గా నిలిచిన శ్వేత ప్రస్తుతం మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రతిభ చాటి పురస్కారం అందుకున్న శ్వేతను జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు గుండా రాజన్న, మండల విద్యాధికారి బి.రాజేందర్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## రైతు రిజిస్ట్రేషన్ చేసి రైతుగా గుర్తించే పరిస్థితి ఎందుకు?

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** రైతులకు ఆంక్షలు పెట్టి రైతులకు అందించాల్సిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందని మాజీ జెడ్పి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలనలో రాక్షస పాలన తలపిస్తుందని అన్నారు. వ్యవసాయానికి నీళ్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ, సమయానికి కరెంట్ ఇవ్వకుండా అరిగోస పెడుతున్నారని అన్నారు. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను మర్చిపోయారని, కనీసం కేసిఆర్ ఇచ్చిన 24గంటల ఉచిత నాణ్యమైన కరెంట్‌ను కూడా అందించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిసి రైతు మెడ మీద కత్తిలాగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పెట్టారని అన్నారు. రైతు పండించిన పంటను అమ్ముకోవడానికి యాప్ ఎక్కడైనా ఉంటదా ప్రభుత్వం బాద్యత మరిచి రైతుకు కొర్రి పెడుతుందని అన్నారు. దేని కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పెట్టినట్లు, రైతులు ఇబ్బంది గురి చేసే విధంగా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉందని అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేకూరే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలని కానీ రెండు కుమ్మక్కై పని చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, నాయకులు రాంచందర్ రెడ్డి, చిరంజీవి, జగన్, మదన్, రమేష్, రాజన్న, రాయమల్లు, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, మల్లయ్య, మహేష్, రమేష్, సుంకం రమేష్, ఆనంద రెడ్డి, రాజు, తిరుపతి, శ్రీనివాస్, శ్రీను, నరసింహ రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

## వేలం పాటలో గణపతి లడ్డు దక్కించుకున్న ముస్లిం యువకుడు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లె టీం సెవెన్ యూత్ గణేష్ మండపం మతసామరస్యానికి వేదికయింది. పది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణపతి చేతిలోని లడ్డును గురువారం మంటప నిర్వాహకులు వేలంవేయగా రూ. 70 వేలకు వేలం పాట పాడి ఒక ముస్లిం యువకుడు గణపతి లడ్డును దక్కించుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. గణేష్ నగర్ కు చెందిన ప్రముఖ గాయకుడు ఎం.డి అభి కుమారుడు మహమ్మద్ ఇషాన్ బాల్యం నుండే వినాయక చవితి నవరాత్రులను తన స్నేహితులతో కలిసి ఘనంగా నిర్వహిస్తుండేవాడు. ముస్లిం మతస్తుడు అయినప్పటికీ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గణేష్ నవరాత్రుల సమయంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడమే కాకుండా ఉపవాస దీక్షను కూడా చేపడుతుండేవాడు. ఈ ఏడు తన మిత్రులతో కలిసి గణేష్ ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా వేలం పాటలో గణేష్ లడ్డూను రూ. 70 వేలకు దక్కించుకోవడం పట్ల ఇషాన్ ను పలువురు అభినందించారు. కులం, మతం పేర్లతో వైశమ్యాలు చోటు చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో కులమేదైనా, మతమేదైనా మనమంతా భారతీయులం అనే భావనతో పాటు తన మతాన్ని ఆచరించడంతోపాటు ఇతర మతాలను కూడా గౌరవిస్తాము అనే సందేశాన్ని మహమ్మద్ ఇషాన్ సమాజానికి అందించాడని ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.